క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయంలో భక్తుల పూజలు



అన్నం వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అమ్మవారి మొక్కుల్లో భాగంగా భక్తులు తమ పిల్లల తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్ భక్తులకు అన్నదానం చేశారు.

కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటాం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: బీఆర్‌ఎస్ పార్టీ కోసం పని చేసే ప్రతీ కార్యకర్తకు అన్నివేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బీఆర్‌ఎస్ రెబ్బెన పట్టణ అధ్యక్షుడు రాపర్తి అశోక్ తల్లి స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం అశోక్ స్వగృహంలో ఆయన తల్లి పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా అశోక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ సర్పంచ్ అహల్యాదేవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కుందారపు శంకరమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మినేని శ్రీధర్, భరద్వాజ్, మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ పాల్గొన్నారు.

వెలవెలబోయిన వెంకన్న జాతర



దుకాణాల వద్ద తక్కువగా ఉన్న రద్దీ

కెరమెరి: మహాశివరాత్రి పురస్కరించుకొని మండల కేంద్రంలోని నెహ్రూనగర్ వేంకటేశ్వర ఆలయం సమీపంలో ప్రారంభమైన జాతర జనం లేక వెలవెలబోయింది. ఆదివారం జాతర చివరిరోజు కూడా పెద్ద సంఖ్యలో జనం రాలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతర కళ తప్పింది. వ్యయ ప్రయాసలకు ఓర్చి జాతరకు వచ్చిన వ్యాపారులు గిరికీలు లేక దిగాలు చెందుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు వ్యాపారం కొనసాగక నిరుత్సాహానికి గురయ్యారు. జాతరలో వినోదం కోసం ఏర్పాటు చేసిన జాతర సర్కస్, బ్రేక్ డాన్స్ ఉయ్యాలలు జనం లేక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



వంగిన విద్యుత్ స్తంభం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని తెలంగాణ తల్లి చౌక్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఆదివారం సాయంత్రం లారీ ఢీకొట్టడంతో స్తంభం వంగిపోయింది. ఆంధ్రప్రదేశ్ నుంచి కర్రలోడు (ముడిసరుకు)తో కాగజ్‌నగర్ చేరుకున్న భారీ లారీ ప్రమాదవశాత్తు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం వంగిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. అనంతరం లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఉట్నూర్ సీఐ మొగిలి పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బక సునీల్, కాంగ్రెస్ నాయకులు సోమోరే నాగోరావ్, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ‘గ్రంథాలయం’

- పాత ఎంపీడీవో భవనంలో ఏర్పాటు
- వెలుతురు లేక తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు, నిరుద్యోగులు
- పక్కా భవనం మంజూరు చేయాలని వేడుకోలు

వాంకిడి: మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేక పాఠకులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయడంతో మండలంలోని నిరుద్యోగ యువత గ్రంథాలయాల వైపు పరుగులు పెడుతున్నారు. కానీ గ్రంథాలయానికి సరైన భవనం లేక శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే బిక్కుబిక్కు మంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. భయానికి కొంతమంది పాఠకులు గ్రంథాలయానికి వెళ్లడమే మానేశారు. మండల కేంద్రానికి వచ్చే ఉన్నతాధికారులు సైతం గ్రంథాలయంపై దృష్టి సారించడం లేదు. వసతులు, సరైన భవనం లేకపోయినా నిరుద్యోగ యువత తప్పనిసరి పరిస్థితుల్లో గ్రంథాలయాలను ఆశ్రయిస్తున్నారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగులు

పరిస్థితి ఇలా..

దశాబ్దాల క్రితం మండలానికి మంజూరైన గ్రంథాలయాన్ని పాత గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా అక్కడే కొనసాగిన గ్రంథాలయానికి చాలా మంది పాఠకులు వెళ్తుండేవారు. క్రమేనా భవనం శిథిలావస్థకు చేరడం, రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో వసతులు కరువయ్యాయి. దీంతో పాఠకులు సైతం వెళ్లడం తగ్గించారు. అనంతరం మూడేళ్ల క్రితం మండల కేంద్రం మీదుగా నాలుగు వరుసల రహదారి మంజూరవడంతో ఆ భవనం తొలగించాల్సి వచ్చింది. ఆ తర్వాత గ్రంథాలయం ఏర్పాటుకు సరైన భవనం లభించక పోవడంతో పద్మశాలి సంఘానికి చెందిన భవనంలో ఏడాది పాటు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి శిథిలావస్థకు చేరిన పాత ఎంపీడీవో భవనానికి మార్చారు.



పాత ఎంపీడీవో భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

పక్కా భవనం మంజూరు చేయాలి



మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేని కారణంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీసారి ఎదో ఒక చోటకు మారుస్తుండడంతో అవస్థలు పడుతున్నాం. ఉన్నతాధికారులు గ్రామీణ నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని పక్కా భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలి.

– వడ్లూరి విలాస్, వాంకిడి

కరెంటు పోతే చీకటి



ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. ప్రస్తుతం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన భవనం శిథిలావస్థలో ఉంది. పగలు కరెంటు పోతే సరైన వెలుతురు ఉండడం లేదు. బయట కుర్చీలు వేసుకొని చదువుకుందామంటే ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. – సంజీవ్, వాంకిడి

పాత భవనం కావడంతో..



గ్రంథాలయాన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన పాత ఎంపీడీవో భవనంలో ఏర్పాటు చేయడంతో చదువుకునేందుకు సౌకర్యవంతంగా లేదు. నాతో పాటు 15 నుంచి 20 మంది నిరుద్యోగ యువకులు ప్రతీరోజు గ్రంథాలయానికి వస్తుంటారు. సాయంత్రం సమయంలో వెలుతురు తగ్గితే అక్కడ ఉండలేని పరిస్థితి ఉంది. పాత భవనం అవ్వడంతో ఇబ్బంది అవుతుంది. – సాయికుమార్, వాంకిడి

కరెంట్ పోతే కష్టమే..

ఏడాది క్రితం వరకు ఎంపీడీవో కార్యాలయంగా ఉన్న భవనాన్ని ప్రస్తుతం గ్రంథాలయంగా ఏర్పాటు చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం కావడంతో భారీ వృక్షాల వేర్లు గోడల్లో పేరుకుపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. అప్పట్లో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సైతం ఆ భవనంలో బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తుండే వారు. ఎంపీడీవో కార్యాలయానికి నూతన భవనం ఏర్పాటు కావడంతో కార్యాలయాన్ని అక్కడి నుంచి మార్చారు. తిరిగి అదే భవనంలోని ఒక గదిని గ్రంథాలయానికి కేటాయించారు. లైబ్రేరియన్ సదానందం చొరవతో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసినప్పటికీ కరెంటు పోతె మాత్రం గది అంతా చీకటిగా మరుతుందని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయానికి స్థలం, భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని రాళ్లపేటలో గల పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కామ పూర్ణిమను పురస్కరించుకొని ఆదివారం జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకం, రుద్రాభిషేక పూజలతో పాటు హోమం నిర్వహించారు. మంగళహారతి, మహామంత్రపుష్పం పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి రథోత్సవం, జాతర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ఉపేందర్ చారి, వేద పండితులు శంకర్, దూపదీప నైవేద్య సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్ శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కోశాధికారి సంతోష్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు శంకర్‌రావు, మాజీ సర్పంచ్ జాదవ్ లలిత, ఆజ్మీర శంకర్ నాయక్, బోర్కుటే తిరుపతి, అజ్మీర మురళీధర్, ప్రేందాస్, బాబురావు, రవీందర్, రమేశ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి పటేల్‌గా వాడై సోనేరావు



వాడై సోనేరావు

కెరమెరి: కెరమెరి గ్రామ పటేల్‌గా వాడై సోనేరావును గ్రామస్తులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇది వరకు గ్రామ పటేల్‌గా వ్యవహరించిన నాగును తొలగించారు.

సన్మార్గమే లక్ష్యంగా ‘ఓంకార ఆశ్రమం’



ఓంకార ఆశ్రమం



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న రాధాకృష్ణుల విగ్రహాలు

- ఆధ్యాత్మిక బాటలో ఖర్జెల్లి ఆశ్రమం
- ఏప్రిల్ 4న శ్రీరాధాకృష్ణ విగ్రహాల ప్రతిష్ఠాపన

చింతలమానెపల్లి: మానవుల్లో సన్మార్గమే లక్ష్యంగా ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపిస్తుంది ఖర్జెల్లి ఓంకార ఆశ్రమం. ప్రజల్లో భక్తి భావం కలిగించేందుకు భక్త కమిటీ బృందం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

శ్రీరాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..

ఆశ్రమంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఏప్రిల్ 4న ఓంకార ఆశ్రమంలో శ్రీరాధాకృష్ణ మందిరం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 2న ఉదయం స్వస్తివాచనం, మంగళవాయిద్యాలతో కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. రాధాకృష్ణులకు జలాధివాసం, నవగ్రహ ఇత్యాది దేవతా హోమాలు నిర్వహించనున్నారు. 3న ఉదయం యంత్రాలకు అభిషేకాలు, మహిళలకు సామూహిక అష్టలక్ష్మి కుంకుమ పూజ, విగ్రహాభిషేకాలు, మహాత్ముల ప్రవచన కార్యక్రమాలు జరుపనున్నారు. 4వ తేదీన గీతామందిర మఠాధిపతులు శ్రీవిష్ణుసేవానందగిరి స్వామి, ఆహ్వానిత మహాత్ముల చేతుల మీదుగా విగ్రహ, యంత్రాల స్థాపన, హోమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తి పెంపొందించే కార్యక్రమాలు..

ఆశ్రమం ఆధ్వర్యంలో ఏటా ఇక్కడ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి, కృష్ణాష్టమి, మహాశివరాత్రి, ఉగాది, హనుమాన్ జయంతి వంటి పండుగలతో పాటు గీతాజయంతి, వైకుంఠ ఏకాదశి, గురుపౌర్ణమి వంటి ప్రత్యేక రోజుల్లో యజ్ఞాలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు గీతా పఠనం, ప్రవచనాలు, సంకీర్తనల కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీ విష్ణుసేవానందగిరి స్వామి, శ్రీ నారాయణానందగిరి స్వామి తదితరులు భక్తులకు ప్రవచనాలు బోధిస్తుంటారు.

2007న అంకురార్పణ..

కరీంనగర్ జిల్లా గాగిల్లాపూర్ ఆశ్రమానికి చెందిన గురువు శ్రీ దయానందగిరి స్వామి శిష్యుడు శ్రీప్రేమస్వరూపానందగిరి స్వామి ఖర్జెల్లి గ్రామంలో ఆశ్రమ ఏర్పాటుకు అంకురార్పణ చేశారు. స్థానికంగా దయానందగిరి స్వామికి శిష్యులు ఉండడంతో ఇక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడానికి 3 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అనంతరం శ్రీశివరాం స్వామి, నారాయణ స్వాముల ఆధ్వర్యంలో భక్తులు ఆశ్రమం అభివృద్ధి చేశారు. 2022లో ఆశ్రమంలో సుమారు రూ. 40లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఆశ్రమం అభివృద్ధికి రహదారిని నిర్మించి ఇతర వసతులను భక్తులు ఏర్పాటు చేశారు.

భక్తిమార్గంతో గొప్ప ఆలోచనలు



మానవుల్లో సత్ప్రవర్తన కలిగించేందుకు, మంచి ఆలోచనలు పెంచేందుకు భక్తిమార్గమే సరైనది. లోకాసమస్త సుఖినోభవంతు అని తెలియజేస్తు ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాం. మనుషుల్లో భేద భావం లేకుండా జీవించడానికి ఆశ్రమం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. – శ్రీశివరాం స్వామి

అందరం భాగస్వాములం..



ఆశ్రమంలో నిర్వహించే కార్యక్రమాలలో అందరం భాగస్వాములవుతాం. దైనందిన జీవితాల నుంచి ప్రశాంతతను పొందడానికి ఆశ్రమంలో అవకాశం ఉంటుంది. ఇక్కడికి వచ్చే భక్తులు తమ ఆలోచనలు పంచుకొని భక్తిమార్గంలో నడుస్తున్నారు.

– జునుగరి నానయ్య, బాలాజీ అనుకోడ

25 ఏళ్లుగా..



నా యుక్త వయసు నుంచే భక్తి మార్గంలో నడుస్తున్నాను. శ్రీప్రేమానందగిరి స్వామి ఆధ్వర్యంలో స్థలాన్ని సేకరించిన అనంతరం ఆశ్రమాన్ని అభివృద్ధి చేస్తున్నాం. స్థానికంగా ఉండే భక్తులు ఆశ్రమంలోని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. – చౌదరి శంకర్, ఖర్జెల్లి

సంబరంగా హోలీ వేడుకలు



దహెగాం: నృత్యం చేస్తున్న యువకులు

దహెగాం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

కౌటాల: మండలంలోని తాటిపల్లి, గోవర్‌హెట్టి, బండలహెట్టి గ్రామాల్లో ఆదివారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. వార్ధా నదిలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. నేడు మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ప్రశాంత వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవాలని ఎస్సై మధుకర్ తెలిపారు. ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా నదుల్లో స్నానాలకు వెళ్లవద్దని హెచ్చరించారు.



కెరమెరి: రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రంగులు కొనుగోలు

కెరమెరి: నేడు రంగోలి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన వారసంతలో ప్రజలు పెద్ద ఎత్తున రంగులతో పాటు, చక్కెల బిల్లలు కొనుగోలు చేశారు.

ఘనంగా కామ దహనం



పట్నాపూర్‌లో కామదహనం చేస్తున్న ఆదివాసీలు



కెరమెరి: కామదహనం చేస్తున్న పెద్దలు

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో ఆదివారం ఘనంగా కాముని దహనం జరుపుకున్నారు. వివిధ వాడలకు చెందిన ప్రజలు నైవేద్యం, కుడకలు తీసుకొచ్చి సమర్పించారు.

తిర్యాణి: హోలీ పండుగ పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో కామదహనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

జైనూర్: ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో పురాతనమైనవని పట్నాపూర్ గ్రామ పటేల్ హన్మంత్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పట్నాపూర్ గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా కామదహనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వెదురు కట్టెలకు చక్కెర హరాలు, కుడుక హరాలు కట్టి నవరకాల కూరగాయలతో కామదహనం చేశారు.



తిర్యాణి: కామదహనం చేస్తున్న ఆదివాసీలు

‘అవకాశవాదులకు పార్టీలో స్థానం కల్పించొద్దు’

ఆసిఫాబాద్: అధికారం కోసం పార్టీలు మారే అవకాశవాదులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అధికారం, పదవులు అనుభవించేందుకు పార్టీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్ర, జిల్లా పార్టీ పెద్దలు అవకాశవాదులను గుర్తించి వారిని పార్టీలోకి తీసుకోవద్దన్నారు. గత ప్రభుత్వం పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేసిందని పేర్కొన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యూబ్ ఖాన్, ఆసిఫాబాద్, జైనూర్ మండల పార్టీ అధ్యక్షులు మసాదే చరణ్, ముఖీద్, చునార్కర్ వసంత్‌రావు, శివారాం నాయక్, మహేశ్ గౌడ్, రవి, శంకర్, బాలు, గంగారాం, వినోద్, బసవయ్య, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

బజార్‌హత్నూర్: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.46.50 లక్షల నిధులు కేటాయించామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ఆదివారం పిప్రి గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగయ్య ఇంట్లో నిర్వహించిన శుభకార్యంలో పాల్గొన్నారు. తాగునీటి సమస్య ఉన్న కాలనీల్లో రూ.1లక్ష ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణరెడ్డి, రాజారాం, యువజన సంఘం మండల దుబ్బుల చంద్రశేఖర్, తాజామాజీ సర్పంచ్‌లు కవిత రఘన్‌రెడ్డి, ఫడ్ జ్ఞానేశ్వర్, నారమ్మ లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఉప్రె వినయ్ మాట్లాడుతూ మూడు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే ఆసుపత్రికి వచ్చి తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఒక వేళ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా మాత్రలు పంపిణీ చేయడంతో పాటు నెలకు రూ.500 నిస్తాయ్ యోజన పథకం కింద అందిస్తామన్నారు. అనంతరం క్షయ వ్యాధి నివారణపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్‌ఎం కృపావాణి, రుక్మిణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి పండుగ

బోథ్: కౌఠ(బి) గ్రామంలో పెద్దమ్మతల్లి పండుగను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పలు వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.